క్లుప్తంగా

వెండి వడ్డాణం విరాళం



వెండి వడ్డాణాన్ని అందజేస్తున్న భక్తుడు

మద్దికెర : మండలంలోని పెరవలి గ్రామంలో వెలసిన శ్రీరంగనాథస్వామి వారికి భక్తుడు కేతినేని రాతన రంగస్వామి 25 తులాల వెండి వడ్డాణం ఆదివారం విరాళంగా ఇచ్చారు. రంగస్వామి మాట్లాడుతూ..మొక్కు చెల్లింపులో భాగంగా వెండి వడ్డాణం అర్చకులు ఎర్రిస్వామికి అందజేశానని చెప్పారు.

రక్తదానంతో ప్రాణదానం



పత్తికొండలో రక్తదానం చేస్తున్న దృశ్యం

పత్తికొండ(తుగ్గలి) : రక్తదానం ప్రాణదానంతో సమానమని, యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని ఆర్యవైశ్య సంఘం పెద్దలు డాక్టర్ సుబ్రహ్మణ్యం అన్నారు. దేవీశరన్నవ రాత్రి మహోత్సవాల సందర్భంగా ఆదివారం పట్టణంలోని శ్రీ కన్యకాపరమేశ్వరీ దేవీ ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం, ఉచిత దంత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. పలువురు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఆర్య వైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దారా పవన్, పట్టణ అధ్యక్షుడు ఈర్లదిన్నె రమేష్, ఉపాధ్యక్షులు ఇల్లూరు రాధాకృష్ణ, చిత్రాల లక్ష్మీనారాయణ, ఇల్లూరి విశ్వనాథం, ప్రధాన కార్యదర్శి బొంతల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారుల బదిలీ

మద్దికెర : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కొంత మంది అధికారులకు పదోన్నతులు రాగా, మరి కొందరు అధికారులు ఇతర ప్రాంతాలకు బదిలీ అయ్యారని రెవెన్యూ అధికారులు ఆదివారం తెలిపారు. రెవెన్యూ ఇన్స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న రవికుమార్‌కు సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి లభించినా.. అదే కార్యాలయంలో నియమించారు. ఆక్కడ సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సునీత ఆర్ఐగా పదోన్నతి రావడంతో చిప్పగిరి మండలానికి బదిలీ అయ్యారు. మండల సర్వేయర్ సుధాకర్ తుగ్గలికి బదిలీ కాగా మద్దికెరకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

హాలహర్విలో ఉచిత వైద్య శిబిరం

హాలహర్వి: స్థానిక రెడ్డి తోటలో నిర్వాహకులు శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో ప్రజలకు బ్లడ్ షుగర్, బీపీ, బాడీ స్కానింగ్, మూగ, చెవిటి సమస్యలపై కౌన్సెలింగ్, చికిత్సలు అందించినట్లు వైద్యులు తెలిపారు. 200 మందికి పైగా రోగులు చికిత్సలు పొందినట్లు చెప్పారు.

దేవరగట్టులో ప్రత్యేక పూజలు

హొళగుంద: మండలంలోని దేవరగట్టులో వెలిసిన మాళ మల్లేశ్వర స్వామికి ఆదివారం సందర్భంగా ప్రత్యేక అలంకరణ, పూజలు జరిగాయి. మూల విరాట్‌లకు తెల్లవారుజామున సుప్రభాత సేవా, అభిషేకాలు, బండారార్చన, కుంకుమార్చన, మహామంగళ హారతి, నైవేద్య సంతర్పణతో పాటు ఇతర పూజలను శాస్త్రోక్తంగా జరిపించి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. స్వామి వారి దర్శనానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చారు.భక్తులకు నిర్వాహకులు అన్నదానం చేపట్టారు.

నేడు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలతో సమావేశం

ఆలూరు: ఈనెల 12 నుంచి ప్రారంభం కానున్న బన్నీ ఉత్సవాల్లో భక్తులకు తాగునీటి సరఫరాపై సోమవారం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలతో స్థానిక కార్యాలయంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మల్లికార్జునయ్య ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. గట్టుకు తరలివచ్చే భక్తులకు నీటి కొరత రాకుండా తీసుకోవలసిన చర్యలపై సమావేశం నిర్వహించి ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ, ఈఈలకు నివేదిక అందజేస్తామని చెప్పారు.

నివాళి

కృష్ణగిరి: కామ్రేడ్ కొమ్మగిరి పెద్ద మాదన్న ఆశయాల సాధనకు కృషి చేస్తామని సీపీఐ మండల సహాయ కార్యదర్శి, గ్రామ సర్పంచ్ రవిమోహన్ అన్నారు. మండలంలోని బోయ బొంతిరాళ్ల గ్రామంలో ఆదివారం పెద్ద మాదన్న వర్ధంతి సందర్భంగా ఆయన స్తూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మధు, మల్లికార్జున, ఆనసూయమ్మ, మాధవకృష్ణ పాల్గొన్నారు.

కొండ చిలువ కలకలం

హొళగుంద: నెరణికి గ్రామంలో దాదాపు 7 అడుగుల మేర పొడువున్న భారీ కొండ చిలువ కలకలం సృష్టించింది. శనివారం రాత్రి చెరువు కింద మేకలు, గొర్రెల కోసం ఏర్పాటు చేసిన దొడ్డి వద్ద కొండ చిలువ సంచరించడాన్ని చూసిన గొర్రెల కాపరులు, స్థానికులు భయాందోళనతో పరుగులు తీసారు. అయితే కొండచిలువ గొర్రెల సమీపంలోకి వెళ్తుండగా కాపరులు కేకలు వేయడంతో కొండవైపు వెళ్లిపోయిందని తెలిపారు.



నెరణికిలో సంచరిస్తున్న కొండ చిలువ

పరిహారం.. పరిహాసమేనా!

- నేటికీ అందని గతేడాది రబీ పంట నష్ట పరిహారం
- పత్తికొండ నియోజకవర్గంలో 19 వేల హెక్టార్లలో పంట నష్టం
- పరిహారం కోసం 14,500 మంది రైతుల ఎదురుచూపు
- ప్రభుత్వం చెల్లించాల్సిన మొత్తం రూ.16 కోట్లు
- గత ఐదేళ్ల పాటు అదే సీజన్‌లో చెల్లించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

టీడీపీ ఎప్పుడు అధికారంలో ఉంటే.. అప్పుడు రైతులు, వ్యవసాయం నిర్లక్ష్యానికి గురవుతుందనేది నిష్ఠూర సత్యం. గతేడాది రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలు వర్షానికి పాడైపోయాయి. దాదాపు 19వేల హెక్టార్లలో పంట నష్టం వాటిల్లగా.. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పంట నష్టపరిహారంగా రూ.16 కోట్లు మంజూరు చేశారు. అయితే ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో చెల్లింపు జరగలేదు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాయుడు పరిహారం చెల్లింపును కనీసం పట్టించుకోవడం లేదు. దీంతో 14,500 మంది రైతులు ఆ మొత్తం కోసం నిరీక్షిస్తున్నారు.





మద్దికెర వద్ద వర్షాలకు కుళ్లిపోయిన శనగ పైరు (ఫైల్), పరిహారం మంజూరు జాబితాలో తమ పేర్లను చూసుకుంటున్న రైతులు (ఫైల్)

మద్దికెర : గత ఐదేళ్లలో ప్రకృతి విపత్తుల సమయంలో రైతులకు పంట నష్టం సంభవిస్తే అదే సీజన్‌లో పరిహారం అందించింది అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం. దీంతో రైతులు సాఫీగా పంటలు సాగు చేసుకోగలిగారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది మొదలు.. రైతులకు ఇక్కట్లు మొదలయ్యాయి. గతేడాది రబీ పంట నష్టపరిహారం ఇప్పటి వరకు చెల్లించకపోవడంతో రైతులు ఆ మొత్తం కోసం ఎదురు చూస్తున్నారు. గతేడాది రబీ సీజన్‌లో పత్తికొండ నియోజకవర్గంలోని మద్దికెర, తుగ్గలి, పత్తికొండ, వెల్దుర్తి మండలాల్లో పప్పుశనగ, వేరుశనగ, పత్తి, వారు తదితర పంటలు సాగు చేశారు. నాడు కురిసిన భారీ వర్షాలకు పంట పొలాల్లో నీరు నిల్వ చేరి పైర్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. అలాగే తెగుళ్లు విజృంభించడంతో దిగుబడులు పూర్తిగా పడిపోయాయి. పంటలు నష్టపోయిన తీరును అంచనా వేసేందుకు కేంద్ర ప్రభుత్వ ప్రతినిధుల బృందం ఆయా ప్రాంతాల్లో పరిశీలించి వెళ్లారు. పంటల సాగుకు అయిన వ్యయం, నష్టం తీరును నివేదికలో పొందుపరిచారు. దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిహారం మంజూరు చేశాయి. ఇలా ఆయా మండలాలకు సంబంధించి 19,023 హెక్టార్లలో పంట నష్టపోయిన 14,523 మంది రైతులకు రూ.రూ. 16,21,22,745 నష్టపరిహారం ప్రకటించాయి. ఈ మొత్తం రైతుల వ్యక్తిగత ఖాతాల్లోకి జమ చేసే సమయంలో సాధారణ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో చెల్లింపులు నిలిచిపోయాయి. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పరిహారం చెల్లింపును పక్కన పెట్టేసింది. మంజూరైన మొత్తాన్ని రైతుల ఖాతాల్లో జమచేయకపోవడంపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా మంజూరు చేయాల్సినది కాదని, కేవలం ఖాతాల్లో జమ చేయడంపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుండటంపై మండిపడుతున్నారు.

మండలాల వారీగా గతేడాది రబీలో నష్టపోయిన పంటలకు ప్రకటించిన పరిహారం..

మండలం	రైతులు	హెక్టార్లు	పరిహారం
మద్దికెర	5,171	7,021	రూ.6,98,82,170
వెల్దుర్తి	3,681	5,000	రూ.2,15,00,000
తుగ్గలి	2,087	2,500	రూ.2,60,00,000
పత్తికొండ	3,584	4,502	రూ.4,47,40,575
మొత్తం	14,523	19,023	రూ. 16,21,22,745

సాయం అందించాలి



గతేడాది రబీలో నష్టపోయిన పంటలకు మాకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.10,200 పరిహారం ప్రకటించినా ఇంతవరకు కూటమి ప్రభుత్వం అందించలేదు. వెంటనే సాయాన్ని అందించి రైతులను ఆదుకోవాలి. పెట్టుబడి సాయం అందక పంటల సాగుకు ఇబ్బందులు పడుతున్నాం. – వేణుగోపాల్, మద్దికెర

పరిహారం ప్రకటించినా జమ కాలేదు



గతేడాది రబీలో ఐదు ఎకరాల్లో పంట నష్టపోయాను. అధికారులు అంచనా వేసి రూ.20 వేలు పరిహారం ప్రకటించారు. అయితే ఇంతవరకు బ్యాంకులో జమ కాలేదు. ప్రభుత్వం ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదు. వ్యవసాయం చేయడానికి ప్రభుత్వాల సహకారం ఎంతో అవసరం. అలాంటిది మంజూరు చేసిన మొత్తాన్ని ఖాతాల్లో జమ చేయడానికి నాలుగు నెలలుగా ఎదురు చూస్తున్నా పట్టించుకోకపోవడం దారుణం. – కాశిదాసు, మద్దికెర

రైతులను మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వం

పత్తికొండ(తుగ్గలి) : అధికారంలోకి వస్తే పెట్టుబడి సాయం ఇస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకూ అందజేయకుండా రైతులను మోసం చేస్తోందని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.సురేంద్ర కుమార్ విమర్శించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. రైతులకు పెట్టుబడి సాయం కింద ఏటా రూ.20వేలు ఇస్తానని హామీ ఇచ్చి ఓట్లు వేయించుకున్నారన్నారు. అయితే ఖరీఫ్ ముగిసి రబీ సీజన్ ప్రారంభమైనా సీఎం చంద్రబాబు పెట్టుబడి సాయం గురించి మాట్లాడక పోవడం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే రెండు విడతల్లో అందించాల్సిన పీఎం కిసాన్ సొమ్ము రైతుల ఖాతాల్లో జమ చేసిందని చెప్పారు. అధికారం చేపట్టి నాటి నుంచి ప్రతిపక్ష పార్టీని తిట్టడమే పనిగా పెట్టుకున్న కూటమి నాయకులు పెట్టుబడి సాయం పంపిణీపై దృష్టిపెడితే బాగుంటుందన్నారు.

నిత్యావసర సరుకుల అందజేత

హొళగుంద: మార్లమడికి, హొళగుంద తదితర గ్రామాలకు చెందిన అనాథ వృద్ధులు, దివ్యాంగులకు ఆదివారం స్వచ్ఛంద సంస్థ సభ్యులు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఆదోని వివేకనంద సేవా సంస్థ అధ్యక్ష, ఉపాధ్యక్షులు మూర్తి, ప్రకాష్ భారత్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు సిద్ధార్థగౌడ్ ఆధ్వర్యంలో సంస్థ సభ్యులు రవికాంత్, శ్రీధర్‌శెట్టి, గాలెప్ప, వెంకటేష్, రాజన్న తదితరులు బియ్యం, కందిబ్యాళ్లు, వంటనూనె, చక్కెర ఇతర సరుకులు అందజేశారు. వీరికి సంస్థ ఆధ్వర్యంలో మూడేళ్ల నుంచి ప్రతి నెల సరుకులు అందిస్తున్నారు.

ఆలూరులో ధర్మప్రచారం

ఆలూరు రూరల్: దసరా పండుగన పురస్కరించుకుని మండల కేంద్రంలో ఆదివారం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక సభ్యులు ధర్మప్రచారం నిర్వహించారు. స్థానిక ఉపాధ్యాయ నగర్‌లో ఆధ్యాత్మిక గ్రంథముల పరిచయం, ప్రచార కార్యక్రమం చేపట్టారు. సమితి గుంతకల్లు, నాగ సముద్రం కమిటీ అధ్యక్షులు కృష్ణమూర్తి, ధనుంజయ, సభ్యులు పాల్గొన్నారు.

బన్ని ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోండి



అరికెరలో మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటరామయ్య

ఆలూరు రూరల్: ఈ నెల 12న హొళగుంద మండలం దేవరగట్టులో జరిగే దసరా బన్ని ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య సూచించారు. ఆదివారం మండలంలోని అరికెర గ్రామంలో బన్ని ఉత్సవాల నిర్వహణపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ..మద్యం సేవించి రింగు కర్రలతో బన్ని ఉత్సవాల్లో పాల్గొనరాదన్నారు. ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సహకరించాలని కోరారు. బన్ని జైత్రయాత్ర సందర్భంగా దేవరగట్టులో 100 సీసీ కెమెరాలు, 5 డ్రోన్ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఉత్సవాల్లో అల్లర్లకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సర్పంచ్ నాగరాజు, సీఐ శ్రీనివాస నాయక్, ఎస్ఐ నరసింహులు, ఏఎస్ఐ చంద్రశేఖర్, గ్రామస్తులు హాజరయ్యారు.

సుళువాయిలో అవగాహన సదస్సు..

హొళగుంద: ఈ నెల 12న జరిగే దేవరగట్టు దసరా బన్ని ఉత్సవంలో అల్లర్లకు పాల్పడితే సహించమని పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య తెలిపారు. ఆదివారం రాత్రి సుళువాయి గ్రామంలో సర్పంచ్ మౌలాలి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ ఉత్సవంలో నాటు సారా సేవించి పాల్గొనరాదని, రింగు కర్రలు వినియోగించరాదని చెప్పారు. రక్తపాతం జరగకుండా భక్తి శ్రద్ధలతో ఉత్సవాలను చేసుకోవాలని కోరారు.

స్తంభించిన ఎయిర్‌టెల్ సిగ్నల్స్



హొళగుందలో ఎయిర్‌టెల్ కంపెనీ సిబ్బందితో వాగ్వాదానికి దిగిన వినియోగదారులు

హొళగుంద: మండలంలో ఎయిర్‌టెల్ సిగ్నల్స్ స్తంభించడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. శనివారం ఉదయం నుంచి ఆదివారం మధ్యాహ్నం వరకు మొబైల్ సిగ్నల్స్ లేకపోవడంతో సేవలకు నిలిచిపోవడంతో వినియోగదారులు అగ్రహానికి లోనయ్యారు. శనివారం ఉదయం ఉన్నట్టుండి సెల్‌లో సిగ్నల్స్ మాయమవడంతో వినియోగదారులు ఇబ్బందులకు లోనయ్యారు. ఫిర్యాదు చెయడానికి ఫోన్‌లు పని చేయకపోవడంతో సిగ్నల్స్ కోసం గంటల తరబడి ఎదురుచూసినా లాభం లేకపోయింది. అత్యవసర పనులున్న వారు అర్ధరాత్రి దాకా వేచి చూశారు. అయినా సిగ్నల్స్ రాకపోవడంతో ఆదివారం ఉదయం మరమ్మతు కోసం వచ్చిన టెక్నికల్ సిబ్బందితో వినియోగదారులు రవికాంత్, జమాపుర బసవ, బాగోడి రామ, పీరా, మంజునాథ్ వాగ్వాదానికి దిగారు. కొద్ది రోజులుగా ఎయిర్‌టెల్ సేవల్లో అంతరాయం తీవ్రంగా ఉంటోందని, ఫిర్యాదు ఎవరికి చేయాలో తెలియక ఇబ్బందులు పడుతున్నామని ఇలాగే కొనసాగితే నెట్‌వర్క్ మార్చుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

సంక్షిప్తం

8నుంచి 'హ్యాపీనెస్'

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తిలోని సత్యసాయి స్కూల్‌లో ఈ నెల 8 నుంచి 11వ తేదీ వరకు ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో హ్యాపీనెస్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సీనియర్ శిక్షకులు లక్ష్మీనారాయణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. శిక్షణలో 18 ఏళ్లు పైబడిన వారు పాల్గొనవచ్చని..యోగా, ప్రాణాయామం, ధ్యానం, సుదర్శన క్రియతోపాటు మరిన్ని ఒత్తిడి నిర్మూలన ప్రక్రియలు నేర్పుతామని పేర్కొన్నారు. వివరాలకు సెల్ 9397089888, 9346895578 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

మృతుడి కుటుంబానికి చెక్కు అందజేత



చెక్కు అందిస్తున్న దృశ్యం

వెల్దుర్తి(కృష్ణగిరి): రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రేపల్లె రాము కుటుంబ సభ్యులకు ఎన్‌హెచ్ 44 యజమాన్యం అందించిన రూ.3 లక్షల చెక్కును నాయకుడు శివశంకరెడ్డి ఆదివారం అందజేశారు. వెల్దుర్తి టౌన్‌లోని 5వ వార్డుకు చెందిన రాము ఎన్‌హెచ్ 44లో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సెప్టెంబర్ 8న నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం పోతుదొడ్డి దగ్గర జాతీయ రహదారిపై క్రోస్లు పెడుతున్న సమయంలో వేగంగా వచ్చి లారీ ఢీకొట్టడంతో అక్కడిక్కడే మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో యాజమాన్యం పరిహారం అందజేసింది.

రోడ్డుకు మరమ్మతులు చేయాలి

ఆస్పరి: మండలంలోని బిణిగేరి గ్రామం నుంచి ఆదోనికి వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డు శిథిలమైందని, వెంటనే మరమ్మతులు చేపట్టాలని సీపీఎం నాయకులు ఆదివారం బిణిగేరిలో రాస్తారోకో చేపట్టారు. పార్టీ మండల కార్యదర్శి హనుమంతు మాట్లాడుతూ బిణిగేరిలో రోడ్డుపై మోకాల్లోతు గుంతలు పడడంతో వాహనాల రాకపోకలకు వాహనదారులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాత్రి వేళల్లో ప్రమాదాలబారిన ఘటనలు అనేకమన్నారు.ఈ రోడ్డుపై నిత్యం ఉన్నతాధికారులు ప్రయాణాలు చేస్తున్నా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రంగస్వామి, రామాంజనేయులు, ఈరన్న, ఇబ్రహీం, తిప్పన్న, నాగరాజు, సూర్యనారాయణ, వీరేష్ పాల్గొన్నారు.

దురుద్దేశంతోనే సస్పెండ్ చేయించారు

కృష్ణగిరి: గ్రామంలో దళితులు రేషన్ బియ్యం పంపిణీ చేయకూడదనే దురుద్దేశంతోనే నన్ను సస్పెండ్ చేయించారని మండల పరిధిలోని కోయిలకొండ గ్రామ రేషన్ డీలర్ చెన్నకృష్ణుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలో దళితులు బియ్యం వేయకూడదని కొందరు అధికార పార్టీకి చెందిన వ్యక్తులు పన్నాగం పడి రెవెన్యూ అధికారులకు తప్పుడు ఫిర్యాదు చేశారన్నారు. అయితే రెవెన్యూ అధికారులు రేషన్ షాపును తనిఖీ చేయకుండా నివేదికను సిద్ధం చేసి ఆర్డీఓకి పంపారన్నారు. గ్రామంలో నివాసం లేదని, బియ్యం సక్రమంగా పంపిణీ చేయడం లేదని, రేషన్ షాప్ తెరవడం లేదనే కారణం చూపుతూ పత్తికొండ ఆర్డీఓ శనివారం సస్పెన్షన్ చేశారన్నారు. కొన్ని సంవత్సరాల నుంచి గ్రామంలో అందరికీ అందుబాటులో ఉండి రేషన్ పంపిణీ చేస్తున్నానని, ఫిర్యాదులో పేర్కొనవన్నీ అవాస్తవాలని, తాను ఎలాంటి తప్పు చేయలేదని అయినా సస్పెండ్ చేయడం అన్యాయమన్నారు. ఉన్నతాధికారులు విచారించి తనకు న్యాయం చేయాలని కోరారు.





ఆస్పరిలో లలితా త్రిపుర సుందరి దేవి అలంకారంలో గాయత్రీ మాత, పార్వతీదేవి



ఆస్పరిలో లక్ష్మీదేవి అలంకారంలో కన్యకాపరమేశ్వరి



పత్తికొండలో శ్రీ అన్నపూర్ణాదేవిగా..



తుగ్గలిలో లలిత త్రిపుర సుందరిగా దుర్గామాత



పత్తికొండలో గాయత్రీ మాతగా సరస్వతీ దేవి

మాతా..అన్నపూర్ణేశ్వరీ నమోస్తుతే



ఆలూరులో చోటా నిక్కర్ అలంకరణతో వాసవీదేవి



రామతీర్థంలో హోమ గుండానికి పూర్ణాహుతి ద్రవ్యాలను సమర్పిస్తున్న భక్తులు

పత్తికొండ(తుగ్గలి): దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. సాంస్కృతిక కార్యక్రమాలతో అమ్మవారి ఆలయాలు, మండపాల ప్రాంగణాలు ఆధ్యాత్మికతకు తోడు వినోదభరితంగా మారాయి. నాలుగో రోజు ఆదివారం పత్తికొండ కన్యకాపరమేశ్వరీదేవీ ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణా దేవిగా, సాయిబాబా ఆలయంలో సరస్వతీ దేవి.. గాయత్రీ దేవిగా, తుగ్గలిలో ప్రతిష్ఠించిన దుర్గామాత అమ్మవారు లలితా త్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయాన్నే పురోహితులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. హోమాలు, అర్చనలు, అభిషేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రోజుకొక అలంకారంలో అమ్మవారు దర్శనమిస్తూ కనివిందు చేస్తున్నారు. భక్తులు పెద్ద ఎత్తున అమ్మ వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ఆస్పరి: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఆస్పరి సమీపంలోని రామతీర్థంలో వేలసిన పార్వతీదేవి, పంచముఖి గాయత్రీ మాత లలితా త్రిపుర సుందరి దేవి అలంకారంలో దర్శనమిచ్చారు. మండల కేంద్రంలో కన్యకాపరమేశ్వరి, మారెమ్మవ్వ లక్ష్మీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయాల్లో పూజారులు గంగ,ఆకు పూజ, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, హోమం,మంగళ హారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

మద్దికెర : మండలంలోని పెరవలి గ్రామంలో శ్రీరంగనాథస్వామి దేవాలయంలో శరన్నరాత్రుల్లో భాగంగా నాలుగవ రోజు ఆదివారం రాజ్యలక్ష్మి అమ్మవారు శాకాంబరి దేవిగా దర్శనమిచ్చారు. అలాగే ఎస్సీ కాలనీలో దేవమ్మ.. అన్నపూర్ణగా, చౌడేశ్వరి దేవి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయాల్లో అమ్మవార్లకు కుంకుమ పూజలు, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు చేసి మహామంగళ హారతి ఇచ్చారు. ఈఓ వీరయ్య సర్పంచులు మల్లికార్జున, సుహాసిని, రాము, ఆంజనేయులు, పెద్దకోట్ల రమేష్ పాల్గొన్నారు.

ఆలూరు: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వదేవిని ఆలయ అర్చకులు మహేంద్ర ఆచార్ ఆధ్వర్యంలో ఆదివారం వాసవీ మాతను (భగవత్‌మాత)చోటా నిక్కర్ రూపంలో అలంకరిచంఆరు. ఈ సందర్భంగా అమ్మవారికి గంగపూజ, ఆకుపూజ, ఫల,పుష్ప, పంచామృతాభిషేకం, మహా మంగళ హారతి తదితర పూజలు చేపట్టారు. పూజల్లో ఆర్యవైశ్యులు,ఆలయకమిటీ పెద్దలు పాల్గొన్నారు.

కృష్ణగిరి: శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా కృష్ణగిరి, వెల్దుర్తి మండలాల్లో అమ్మవారి ఆలయాల్లో విశేష పూజలు కొనసాగుతున్నాయి. భక్తులు తరలి వచ్చి అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు తీర్చుకుంటున్నారు. నవరాత్రుల్లో నాల్గవ రోజైన ఆదివారం కృష్ణగిరి మండలం కటారుకొండ గ్రామంలో దుర్గాదేవి లలితా త్రిపుర సుందరిగా, వెల్దుర్తిలోని అమ్మవారిశాలలో లలితా త్రిపుర సుందరిగా కన్యకాపరమేశ్వరి, అలాగే వెల్దుర్తిలోని భువన గాయత్రీ దేవి లలితా త్రిపుర సుందరిగా దర్శనమిచ్చారు. ఆలయాల్లో సర్విశెట్టి యశ్వంత్, కందగడ్ల శకుంతలమ్మ, భువన గాయత్రీ దేవాలయంలో ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులు జూలకంటి రఘునాథ్ రెడ్డి, లక్ష్మి సరోజ, జగదీష్, రమణాచారి, హరినరసింహనాయుడు, రమణాచలం, హరినాథ్ ఆచారి సాయంత్రం అన్నదానం ఏర్పాటు చేశారు.



పెరవలిలో శాకాంబరిదేవి రూపంలో రాజ్యలక్ష్మి



మద్దికెరలో అన్నపూర్ణగా దర్శనమిచ్చిన దేవమ్మ



ప్రత్యేక అలంకరణలో చౌడేశ్వరి దేవి



వెల్దుర్తిలో లలితా త్రిపుర సుందరిగా భువన గాయత్రీ



కటారుకొండలో ..



వెల్దుర్తిలో లలితాత్రిపుర సుందరిగా వాసవీమాత



నాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

అ'పూర్వ' కలయిక

దేవనకొండ: స్థాని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1997–98 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. దాదాపు 26 సంవత్సరాల తరువాత కలవడంతో వారి ఆనందాలకు హద్దులు లేకుండా పోయాయి. నాడు వారికి విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు రమేష్‌బాబు, శ్రీరాములు, నారాయణస్వామి, భక్త కన్నప్ప, వార్డెన్ శ్రీనివాసులు, పద్మజ, ఇదయతుల్లా, రంగస్వామి, తిమ్మయ్యను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. చదువుకున్న పాఠశాల అభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలు అందించాలని తీర్మానించారు. పేద విద్యార్థుల సంక్షేమానికి కృషి చేస్తామని తెలిపారు.

వడ్డే ఓబన్నకు నివాళి



వందవాగిలిలో వడ్డే ఓబన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వడ్డెర్లు

హొళగుంద: వందవాగిలి గ్రామంలో ఆదివారం రేనాటి వీరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న 178వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. వడ్డెర సంఘం మండల ఉపాధ్యక్షుడు వడ్డే మారెన్న మాట్లాడుతూ వడ్డెర్లు సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. సంఘం నాయకులు వడ్డే హనుమంతు, వీరేష్, తాయప్ప, మరిస్వామి, చిన్న వీరేష్, గోపాల్, కరిబీర పాల్గొన్నారు.